క్లుప్తంగా

నూతన సంవత్సర వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

విజయవాడ స్పోర్ట్స్: నూతన సంవత్సర వేడుకల్లో ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లకు, వివాదాలకు పాల్పడి హద్దు మీరి ప్రవర్తించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 2024 మార్చి 31వ తేదీ వరకు జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, దీంతో పాటు 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని గుర్తు చేశారు. ఐదుగురు, అంతకన్నా ఎక్కువ మంది ఒకే ప్రాంతంలో గూమిగూడవద్దని సూచించారు. కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకలకు కొన్ని ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. 31వ తేదీ రాత్రి బెంజిసర్కిల్ ఫ్లైఓవర్, కనకదుర్గ ఫ్లైఓవర్, పీసీఆర్ ఫ్లైఓవర్‌పై వాహనాలు అనుమతించమని పేర్కొన్నారు. బీఆర్టీఎస్, బందరు రోడ్డు, ఏలూరు రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తామని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల నిర్వహణకు క్లబ్‌లు, రెస్టారెంట్లు ముందస్తు పోలీస్ అనుమతి తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, గుంపులుగా చేరి రోడ్లపై కేకలు వేయొద్దని, ట్రిపుల్ రైడింగ్ వద్దని, శబ్ద కాలుష్యానికి పాల్పడి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు.

అనంతలక్ష్మీదేవి సేవా సంఘం డైరీ ఆవిష్కరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): అనంతలక్ష్మీదేవి సేవా సంఘం నూతన సంవత్సరం డైరీని మాజీ ఎంపీ, సేవా సంఘం గౌరవాధ్యక్షుడు గోకరాజు గంగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సంఘం సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనంతలక్ష్మీదేవి సేవా సంఘం అధ్యక్షుడు పెనుమత్స అప్పలరాజు, భాస్కరరాజు, పి.రాఘవరాజు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు జీవనశైలిలో భాగమవ్వాలి

కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్రీడలు జీవనశైలిలో భాగమవ్వాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. విద్యాధరపురంలోని క్రీడా మైదానం (స్టేడియం)లో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల పోటీలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరచారు. క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న 45 ఏళ్ల వ్యక్తిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు.

నాణ్యతతో రోడ్డు పనులు పూర్తి చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశించిన సమయంలో రోడ్డు పనులు పూర్తి చేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి సూచించారు. 30వ డివిజన్ జీవీఆర్ నగర్‌లో బీటీ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దుర్గారావు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభ్యున్నతికి కృషి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళా సాధికారతకు పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ రుణాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సొసైటీ చైర్మన్ ఆలమండ ఎల్లారావు పేర్కొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం సొసైటీ 10వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో చుక్కపల్లి అరుణ్‌కుమార్ సహకారంతో ఈ సంస్థ ఆవిర్భవించిందన్నారు. సంస్థ కార్యకలాపాలను ప్రజలకు చేరువ చేసి వ్యాపారులు, మహిళల ఆర్థిక స్థాయి పెంపొందించడమే తమ లక్ష్యమన్నారు. మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేశామని చెప్పారు. త్వరలో మరిన్ని శాఖలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మాజీ డైరెక్టర్ జీవీ సాంబశివరావు, సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ చుక్కపల్లి అరుణ్‌కుమార్, కోశాధికారి జోత్స్న, సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'సెంట్రల్'లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి చేసిన పలు రోడ్లను ఆదివారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలో అభివృద్ధి చేసిన బీటీ రోడ్డు, 58వ డివిజన్ నందమూరినగర్‌లోని బీటీ రోడ్డు, తోటవారివీధిలో నిర్మించిన పైపులైను, 61వ డివిజన్ ఎలక్ట్రిసిటీకాలనీలో అభివృద్ధి చేసిన సీసీ రోడ్డు, 63వ డివిజన్‌లో అభివృద్ధి చేసిన సీసీ రోడ్డును ఆదివారం ఎమ్మెల్యే విష్ణు ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డివిజన్ కార్పొరేటర్లు, ఇంచార్జీ లు, అధ్యక్షులు, కోఆర్డినేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.

జగనన్నతోనే అన్ని వర్గాల అభ్యున్నతి

- రూ. 17 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులకు భూమిపూజ
- ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఎస్సీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో రూ. 17 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, డివిజన్ ఇంఛార్జీ గుండె సుందర్‌పాల్‌తో కలిసి శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్‌లో రూ. 10 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. చంద్రబాబు హయాంలో చెరువులను తలపించిన లోటస్ ల్యాండ్‌మార్క్ ప్రాంతాన్ని.. రూ. 6 కోట్లతో మోడల్ ప్రాంతంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అలాగే రూ. 40 లక్షలతో ఆర్చ్ రోడ్డు, రూ. 15.35 లక్షలతో శానిటరీ కార్యాలయాన్ని ప్రారంభించుకున్నట్లు గుర్తు చేశారు. రూ. 1.05 కోట్లతో అయోధ్యనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

జనవరిలో పట్టాల పండుగ

జనవరి నెల చివరికల్లా నియోజకవర్గంలో పెండింగ్ పనులన్నింటినీ నూరు శాతం పూర్తి చేసేలా కృత నిశ్చయంతో పని చేస్తున్నట్లు మల్లాది విష్ణు స్పష్టం చేశారు. అలాగే జనవరి మాసంలో పట్టాల పండుగ ఉంటుందని.. నియోజకవర్గంలో 8,146 మందికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా 'ఇళ్ల పత్రాలను అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఈ(ఇంజినీరింగ్) గురునాథం, కార్పొరేటర్లు చన్నగిరి రామ్మోహన్ రావు, శర్వాణీమూర్తి, కొంగితల లక్ష్మీపతి, నాయకులు ఒగ్గు గవాస్కర్, పేరం త్రివేణిరెడ్డి, గుడిసె శ్యామ్, అబ్రహాం, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో ఎన్టీఆర్ జిల్లా

కలెక్టర్ ఢిల్లీరావు



మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాల అమలులో ఎన్టీఆర్ జిల్లా 2023లో ప్రగతిపథంలో పయనించిందని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. నూతన సంవత్సరం 2024 లోనూ ఇదేవిధంగా మంచి జరగాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావు మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, మీడియా ప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పేదలందరికీ ఇళ్లు, ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 సవాళ్లతో కూడుకున్న కార్యక్రమాలని పేర్కొన్నారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకునేలా కొత్త సంవత్సరంలో నో యువర్ పోలింగ్ స్టేషన్, నో యువర్ ఓట్ ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కొత్త సంవత్సరంలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయని అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్‌వీ మోహన రావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పీఆర్వో వి.వి.ప్రసాద్, ఐ అండ్ పీఆర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



నాడు-నేడు అభివృద్ధి పనుల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సంక్షేమం, అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక 33వ డివిజన్ వందనంవారి వీధిలో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డివిజన్‌లో జరిగిన అభివృద్ధి పనులపై నాడు-నేడు ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తర్వాత 33వ డివిజన్‌లో రూ. 9.05 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ముఖ్యంగా గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో యూజీడీకి సంబంధించి ఒక్క సంపు కూడా నిర్మించలేదని చెప్పారు. తమ ప్రభుత్వంలో రూ. 2.50 కోట్లతో యూజీడీ సంపు నిర్మాణం చేపట్టామని, మరో 15 రోజుల్లో ప్రారంభించుకునేలా పనులు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఆంధ్రరత్న పార్కును రూ. 10 లక్షలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఏకేటీపీ స్కూల్‌లో రూ. 2.62 కోట్లు, ప్రశాంతి ప్రాథమిక పాఠశాలలో రూ. 30 లక్షలతో చేపట్టిన నాడు-నేడు పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. పరిపాలనలో జగనన్న ప్రభుత్వానికి మరెవరూ సాటిరారని సెంట్రల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈ గురునాథం, ఏఈ నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాస్, తల్లాప్రగడ సుబ్బారావు, లంకా బాబు, మైలవరపు రామకృష్ణ, నాలం బంగారి, జగదీష్, కమ్మిలి రత్నకుమార్, కొల్లూరు రామకృష్ణ, చల్లా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేయొద్దు

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్



అజిత్‌సింగ్‌నగర్ చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో పరిస్థితిని తెలుసుకుంటున్న కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ప్రజలు రోడ్లపై చెత్త వేయొద్దని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మె కారణంగా ప్రత్యేక బృందాలతో ప్రజల ఇంటి వద్ద నుంచి చెత్త సేకరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం సాయంత్రం ఆయన అజిత్‌సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్‌ను సందర్శించి స్థానికంగా పరిస్థితిని అధికారులు, సిబ్బందిని వివరాలడిగి తెలుసుకున్నారు. ప్రతినిత్యం వస్తున్న చెత్తను, సమ్మె కారణంగా ఎంతమంది విధులకు హాజరవుతున్నారని విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి ప్రతినిత్యం చెత్త సేకరించే వాహనాలు వస్తాయని, నగరవాసులు వారి చెత్త, వ్యర్థపదార్థాలను సంబంధింత వాహనాల్లో మాత్రమే వేయాలన్నారు.

'నంది అవార్డు' సాధించడం గర్వంగా ఉంది



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన 'మంచి గుణపాఠం' నాటికకు నంది అవార్డు లభించడం చాలా గర్వంగా ఉందని సింగ్‌నగర్ శ్రీరామ్ హైస్కూల్ కరస్పాండెంట్ బోని సురేష్‌కుమార్ అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గుంటూరులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నంది నాటక ఉత్సవాల్లో ఆ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన మంచి గుణపాఠం నాటిక బాలల నాటిక విభాగంలో నంది అవార్డును సొంతం చేసుకుంది. ఏపీ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసినటువంటి సర్టిఫికెట్లు, నంది అవార్డుతో పాటు రూ. 25 వేల నగదు బహుమతిని అందజేశారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారులు ఇలానే మరిన్ని ప్రదర్శనలు చేసి నగరానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం నాటికలో పాల్గొన్న 26 మంది విద్యార్థులను, నాటిక రచయిత డాక్టర్ పీవీఎన్ కృష్ణ, దర్శకుడు సాయిశంకర్, సహాయ సహకారాలు అందించిన జగదీశ్వరీ, సుబ్రహ్మణ్య శ్రీనివాస్‌లను పాఠశాల యాజమాన్యం సన్మానించి, అభినందించారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



వృద్ధాశ్రమంలో విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని పిల్లల మానసిక వైద్యనిపుణుడు, లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి చెప్పారు. సిద్ధార్థ నగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ విద్యార్థులు పాఠశాల ఆవరణలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, స్వీట్లు, కూల్‌డ్రింక్స్ మొదలైన వాటిని శుక్రవారం ప్రదర్శనతో పాటుగా విక్రయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయులు వాటిని కొనుగోలు చేశారు. ఇలా వచ్చిన నగదుతో పాటుగా పాఠశాల యాజమాన్యం కొంత నగదును జమ చేసి నిత్యావసరాలు, వస్త్రాలు, దుప్పట్లు, డైపర్లు, పండ్లు, కూరగాయలు కొనుగోలు చేసి వాటిని శనివారం నగరంలోని నిర్మల శిశుభవన్, రాఘవయ్య పార్కు సమీపంలోని నిర్మల్ భవన్, గుణదల పడవల రేవు సెంటర్‌లోని మదర్‌థెరిస్సా అనాథాశ్రమానికి వెళ్లి అక్కడివారికి అందజేశారు. విద్యార్థులు కొంతసేపు అక్కడ గడిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ సుధ ప్రవీణ, సిబ్బంది పాల్గొన్నారు.

కేడీసీసీబీ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



కేడీసీసీబీ డైరీ ఆవిష్కరించిన చైర్‌పర్సన్ పద్మావతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ టర్నోవర్ మరింతగా పెంచాలని కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. బందరు రోడ్డులోని కేడీసీసీ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో బోర్డు సమావేశం, నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ శనివారం జరిగింది. చైర్‌పర్సన్ పద్మావతి కేడీసీసీ బ్యాంక్ 2024 క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులు, ఖాతాదారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ బ్యాంకు టర్నోవర్ పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్స్ కొమ్మినేని రవిశంకర్, గడిదేశి పెదవెంకయ్య, గుమ్మడపు రవీంద్రరానా, భూక్యా రాణి, తలుపుల వెంకటకృష్ణ రావు, పడమట సుజాత, ప్రొఫెషనల్ డైరెక్టర్స్ మధుమూర్తి, చంద్రశేఖరఆజాద్, శ్యామ్‌మనోహర్, జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, రంగబాబు, డెప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, చీఫ్ మేనేజర్ రాంబాబు, డెప్యూటీ మేనేజర్ ప్రభాకర్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో నగరాభివృద్ధి

- మేయర్ రాయన భాగ్యలక్ష్మి
- చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాం
- చెరువుల సుందరీకరణకు చర్యలు
- 2023 వార్షిక నివేదికను వెల్లడించిన మేయర్



సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికతో విజయవాడను అభివృద్ధి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి చెప్పారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో శనివారం ఆమె 2023 వార్షిక నివేదికను వివరించారు. కమిషనర్ స్వప్నిల్‌దినకర్, డెప్యూటీ మేయర్లు బెల్లందుర్గ, అవుతు శ్రీశైలజతో కలిసి సమావేశంలో ఆమె మాట్లాడారు. గత పాలకులు నగరాభివృద్ధిని వదిలేశారని, తాము అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రధాన ప్రాంతాలు, శివారు, కొండప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అధికారిక లెక్కల ప్రకారం 15 లక్షల జనాభా కలిగిన నగరంలో నిత్యం పారిశుద్ధ్య నిర్వహణలో దేశంలోనే మెరుగైన స్థానాన్ని సాధించబోతున్నామని పేర్కొన్నారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో భాగంగా విజయవాడను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం కూడా సంతృప్తి చెందిందని తెలిపారు. ఇటీవల గార్బెజ్ ఫ్రీ సిటీ విభాగంలో దక్షిణ భారతదేశంలో మొదటి స్థానం, దేశంలో రెండో స్థానానికి అర్హత సాధించిందని త్వరలోనే అధికారికంగా ర్యాంకింగ్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని చెప్పారు. పాయకాపురం చెరువుల పునరుద్ధరణ, బందరు కాల్వ, ఏలూరుకాల్వ, రైవస్ కాల్వల సుందరీకరణతోపాటు కాల్వల్లో పేరుకుపోయిన 660 మెట్రిక్‌టన్నుల చెత్తవ్యర్థాలను తొలగించామని పేర్కొన్నారు. కాల్వగట్లను వినోదాత్మక ప్రదేశాలుగా తీర్చిదిద్దటం, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, ప్లే ఏరియాలు, గ్రీనరీని పెంపొందించామని ఈ ఏడాది బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ దిగువన వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేశామని, మహిళలకు ప్రత్యేకంగా పింక్ టాయిలెట్లను నిర్మించామని వివరించారు.

- **ఇంజినీరింగ్:** వీఎంసీలోని ఆయా డివిజన్లలో రూ.31.88 కోట్లతో 15.78 కిలోమీటర్ల సీసీరోడ్లు, 16.32 కి.మి. తారురోడ్డు పూర్తిచేయడం, రూ.2.78 కోట్లతో రోడ్లకు మరమ్మతులు చేశామని తెలిపారు.
- **నీటిసరఫరా:** నగరంలోని మాచవరం, గుణదల కార్మికనగర్, క్రీస్తురాజపురం, మొగల్రాజపురం, పకీరుగూడెం తదిర ప్రాంతాల్లో 22.28 కి.మి దూరం వరకు రూ. 4.55 కోట్లతో నూతన పైపులైన్లు ఏర్పాటు చేశామన్నారు.
- **స్టాం వాటర్ డ్రెయిన్ పనులు:** 43వ డివిజన్‌లో 1.40 కోట్లతో 700 మీటర్ల దూరం అవుట్ ఫాల్ నిర్మాణం, 3వ డివిజన్‌లో రూ.1.98 కోట్లతో నేషనల్ హైవే నుంచి ఆటోనగర్ వరకు స్టాం వాటర్ డ్రెయిన్ నిర్మాణం చేశామన్నారు.
- **భవన నిర్మాణ పనులు:** సర్కిల్-2 పరిధిలో రూ.1.39 కోట్లతో రెండు సచివాలయాల నిర్మాణం, 1.3 కోట్లతో ఏడు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలు, రూ.కోటితో రెండు కమ్యూనిటీ హాళ్లు, సర్కిల్-3 పరిధిలోని చలసాని నగర్‌లో రూ.49.55 లక్షలతో జిమ్ భవనం నిర్మాణం చేశామని తెలిపారు.
- **గడపగడపకు మన ప్రభుత్వం:** పశ్చిమ నియోజకవర్గంలో రూ.16 కోట్ల నిధులు 166 పనులకు మంజూరవ్వగా అందులో ఇప్పటి వరకు ప్రాధాన్యం కలిగిన పనులను రూ. 4.99 కోట్లతో పూర్తి చేశామన్నారు.
- సెంట్రల్ నియోజకవర్గంలో 85 పనులకు రూ.14.7 కోట్లు నిధులు మంజూరవ్వగా అందులో రూ.5.5 కోట్లు పనులు పూర్తిచేశామన్నారు.
- తూర్పు నియోజకవర్గంలో 124 పనులకు రూ. రూ.16.84 కోట్లు మంజూరవ్వగా అందులో 68 పనులు పూర్తిచేశామన్నారు.

సంక్షేమ పథకాలు : వైఎస్సార్ పెన్షన్ కానుకకు 69,436 లబ్ధిదారులకు రూ.19.5 కోట్లు, వైఎస్సార్‌సున్నావడ్డీకి 11,178 సంఘాలకు రూ.17.52 కోట్లు, జగనన్న అమ్మఒడి 63,621 లబ్ధిదారులకు రూ.82.7 కోట్లు, జగనన్న తోడు 6058మంది లబ్ధిదారులకు రూ.45 లక్షలు, వైఎస్సార్ చేయూతకు 33,402 మంది లబ్ధిదారులకు రూ.62.62 కోట్లు ఖర్చు చేశామన్నారు. వైఎస్సార్‌ఆసరాకు 92,980 మందికి రూ.81.60 కోట్లు, వైఎస్సార్ చేదోడుకు 6565 మందికి రూ.6.56 కోట్లు, వైఎస్సార్ కాపునేస్తంకు 6985 మందికి 10.5 కోట్లు, వైఎస్సార్‌వాహన మిత్రకు 6285 మందికి రూ. 6.56 కోట్లు, వైఎస్సార్‌ఈబీసీ నేస్తంకు 5677 మందికి రూ.8.51 కోట్లు, వైఎస్సార్ మత్స్యకార భరోసాకు 329 మందికి రూ.33లక్షలు, వైఎస్సార్ నేతన్న నేస్తం నలుగురుకు రూ. 96వేలు, వైఎస్సార్ విద్యాదీవెనకు 14,523 మందికి రూ.122 కోట్లు అందించామని తెలిపారు.

శ్రీ మందిర్ పరిక్రమ ప్రకల్ప ప్రారంభోత్సవానికి ఆహ్వానం



కలెక్టర్ ఢిల్లీరావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఒడిశా రాష్ట్రం పూరిలో జనవరి 17వ తేదీన జరిగే శ్రీ మందిర్ పరిక్రమ ప్రకల్ప ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు ఆహ్వానం అందింది. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఉత్సవ కమిటీ ప్రతినిధులు కలెక్టర్ ఢిల్లీరావును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఒడిశా రాష్ట్ర అడిషనల్ డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హిమాన్షుభూషణ్ సమరత్‌తో కూడిన కమిటీ సభ్యులైన సభాయత్‌లు జైనారాయణ మహాపాత్ర, మహాకాంత్ మహాపాత్ర, మారబ్బ చంద్ర మహాపాత్రలు కలెక్టర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. జనవరి 17న ఒడిశా రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన శ్రీ మందిర్ పరిక్రమ ప్రకల్పను ఆ రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్ ప్రారంభిస్తారని ప్రతినిధులు తెలిపారు. రూ. 331.28 కోట్లతో పూరి జగన్నాథస్వామి ఆలయానికి సమీపంలో శ్రీ మందిర్ పరిక్రమ ప్రకల్పలో భక్తులకు ఆధునిక వసతులు కల్పించారని ఉత్సవ కమిటీ సభ్యులు కలెక్టర్ ఢిల్లీరావుకు వివరించారు.

రోగులకు చిరునవ్వుతో సేవలందించాలి



పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థినికి డిగ్రీ ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగేశ్వరరావు

గన్నవరంరూరల్: వైద్యులు రోగులకు చిరునవ్వుతో సేవలందించాలని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల 14వ గ్రాడ్యుయేషన్ స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాధికా రెడ్డి డెంటల్ వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పటినుంచి సమాజంలో వైద్యులుగా మీ బాధ్యత పెరుగుతుందని ఉన్నతమైన సేవలు అందిస్తే ప్రతిఫలంగా సంతృప్తి, గౌరవం, కీర్తి, డబ్బు లభిస్తాయని చెప్పారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు, మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్యులు చేతులతో, మనస్సుతో, విజ్ఞానంతో సేవలందించాలని చెప్పారు. వీటితో సేవలందించిన వారిని ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చూస్తారన్నారు. కన్వీనర్ పి.రంగసాయి మధుసూదనరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, హెచ్‌వోడీలు, బోధనా సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మొదట డాక్టర్ రాధికారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా 2018 బ్యాచ్ గ్రాడ్యుయేట్లు 114 మంది, 9వ బ్యాచ్ పోస్టు గ్రాడ్యుయేట్లు 28 మంది డిగ్రీలు స్వీకరించారు.

సత్తాచాటిన రాజ్‌కమల్ రోలర్ స్కేటింగ్ రింక్ క్రీడాకారులు



విజేతలతో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, ఎంబీ బాలమురళీధర్, రాజేంద్రప్రసాద్, కోచ్ ఎండీ ఖాజా

మధురానగర్(విజయవాడ సెంట్రల్): సత్యనారాయణపురం రైల్వే కాలనీలోని రాజ్‌కమల్ రోలర్ స్కేటింగ్ రింక్ క్రీడాకారులు కోచ్ ఎండీ ఖాజా శిక్షణలో రోలర్ స్కేటింగ్ స్పీడ్ కేటగిరీ-61 స్టంప్ నేషనల్స్‌లో సత్తాచాటి పతకాలు సాధించారు. ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు విజయవాడ రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాజ్‌కమల్ రోలర్ స్కేటింగ్ రింక్ క్రీడాకారులు నాలుగు బంగారు పతకాలు, నాలుగు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, సీనియర్ డీపీఓ ఎంబీ బాలమురళీధర్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ విజేతలుగా నిలిచిన క్రీడాకారులు, కోచ్ ఎండీ ఖాజాను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు సాధించి నగరానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన వీ జాహ్నవి, కే విఘ్నేష్, గొల్లపూడి యశ్వంత్‌లు మరింత మెరుగైన ప్రదర్శన చేయాలని సూచించారు.